పి. ఐ. పి.

శ్రీ తాడిగిరి పోతరాజు

"భోజనం చేసి వెళ్లాలి సార్...తొమ్మిది కావస్తోంది...మీకు ఏడింటికే భోంచేసే అలవాటు...ఇక వెళ్దాం"...చేతులు నలుపుకోసాగాడు, ముందుకు వంగబడిన మూర్తి.

'స్లాక్‌షర్ట్' క్రింద ధోవతి కట్టుకొన్న యన్. జి. వో.

దీనమైన చూపులతో వాడిపోయిన చిన్నకళ్లు—వయస్సుకన్న ముందే సగంవరకూ వెంట్రుకలు రాలిపోయిన మాడు. చెవులకుపైన రెల్లుదుబ్బుల్లా పెరిగిన నలుపూ తెలుపూ వెంట్రుకలు.

మూర్తి బి. ఏ కాదు—'ఓల్డ్' యస్. యస్. యల్. సి. 'ఓల్డ్' ఈజ్ 'గోల్డ్' అంటాడు తను. ఇంగ్లీషు వ్యాకరణం తెల్లవాడికన్న పది ఆకులు ఎక్కువే చదివాడు. తన 'డ్రాఫ్ట్' చూసి ఎందరో ఆఫీసర్లు 'శభాష'ని భుజం తట్టారట. వాళ్లలో ఇద్దరు ముగ్గురు వాళ్ల పిల్లలకు ట్యూషన్ కూడ చెప్పమన్నారట.

కానీ ప్రమోషన్ ఇప్పిస్తామని ఎవరూ అనలేదు. ఎందుకంటే మూర్తి బ్రతకనేర్చినవాడుకాదు. తాను బ్రతుకుతూ ఆఫీసరును బ్రతికించేవాడుకాదు—అల్పసంతోషి. ప్రతి చిన్నమెచ్చుకోలుకూ చెవులవరకూ పెదవులు సాగదీసికొని పిచ్చినవ్వు నవ్వటం మినహా ఏమీ తెలియదు.

'ఆలస్యమైతే ఏం ఫర్వాలేదులే......అయినా నీ కెందు కీ శ్రమంటే విన్నావ్‌కాదు......పాపం మీ ఇంట్లో వాళ్లకు ఎంతో శ్రమ...పైగా ఉట్టిమనిషి కూడ కాదేమో'...నే నన్నాను.

'బాధేముందండీ ఇందులో......మీరు మా ఇంట్లో చెయ్యికడిగితే మా కెంత గొప్పగా ఉంటుందో నల్గురిలో...తమలాటివాళ్లు మా ఇంటికి భోజనాని కొస్తున్నారని అది ఎంత సంబరపడిపోతుందో......డ్రైవర్ని పిలవమంటారా?'...కంగారుకంగారుగా వాకిలి కేసి అడుగులు వేశాడు.

'వద్దులే...ఏపాటిదూరముందని మీ ఇల్లు...దగ్గరేగా?...నడిచివెళ్దాంలే...' ధోవతి బిగించుకొని మెల్లగా మెట్లు దిగాను. లైట్స్ ఆఫ్‌చేసి తాళం వేశాడు ప్యూన్.

నా ముందు మూర్తి 'పైలట్'లా.

నా వెనుక ప్యూన్—గార్డులా—అది నా డిగ్నిటీ—వాళ్లతో విస్తరించి మాట్లాడితే అది (G. O.) జీ. వో. గా నా హోదాకు భంగం. శ్మశానంనుండి తిరిగి వెళ్తూన్న బంధువుల్లా మేం ముగ్గురం—

ఒక ఫర్లాంగు దూరంవరకూ విద్యుద్దీపాలున్న బజారు. ఆ బజారులోని సిమెంటురోడ్డుకు అనుబంధంగాఉన్న సందువైపు తిరిగింది మూర్తి శరీరం. అటూ ఇటూ 'ట్రాఫిక్' చూసికొని రోడ్డుదాటి మూర్తిని అనుసరించాను. చెదురు మదురుగా మిణుకు మిణుకుమంటూన్న మున్సిపాలిటీ దీపాల సందు. లోతులేని సైడు కాలవల్లోపడి దొర్లాడి రోడ్డునూ, డ్రైయినేజినీ ఏకంచేసే పందులకు పట్టుగొమ్మయైన గల్లీ. దారివెంటవెళ్ళే ప్రయాణీకులను లెక్కచెయ్యక విసురుగా ఎంగిలాకులు వాలే వీధి. అక్కడక్కడ వెలుగు చారికల్లో వీధిని ఆకట్టుకొన్న అరుగులు మెట్లు. కొన్ని అరుగులపై మేకలు నెమరువేస్తూ పెంటికలు విసర్జిస్తున్నాయి.

దారిలోకి పొడుచుకొచ్చిన ఇళ్లముందు 'వన్‌వే ట్రాఫిక్'. 'సార్...ఇక్కడ కొద్దిగా బురదగా ఉంది. అక్కడ ఆ రాతిపై కాలువేసి ఒక అంగ వెయ్యండి...కొద్దిగా ఒక్కపది గజాలు బురద...ఆ తరువాత

అంతా బావుంటుంది...' ఆ మాట అప్పటికి పదో సారి అన్నాడు మూర్తి.

'బండ ఏదీ...ఓహో...ఇదా...ఈ తెల్లగా కనిపించేదేగా?'...మూర్తి చూపిన బండను శ్రద్ధగా వెతుక్కొంటూ చిన్నరాతిపై కాలు మోపాను. ఆ 'ఫీట్' చెయ్యటం అలవాటు లేక చెప్పు చర్రున జారింది–గిలకలవరకూ తారులాటి పదార్థం. తప్ప తాగి నిద్రపొయ్యేవాణ్ణి లేపితే, బూతులు తిట్టి నట్లు నిశ్చలత చెడిన మురుగు కాలువ ముక్కులు పగిలే దుర్గంధం వెదజల్లసాగింది.

ధోవతి పైకి తీసికొని ముక్కుకు అడ్డం పెట్టు కొన్నాను.

'ఈ ఊరు మున్సిపాలిటీ వాళ్ళంత రోగ్స్ సార్...ఇళ్ళవిూద పన్ను సరిపోక 'వృత్తిపన్ను'ని వసూలు చేస్తున్నారు. అయినా ఈ వీధులింతే... ఎప్పుడైనా గవర్నరో, ఎవడో మంత్రివస్తున్నాడంటే ఇంత డి. డి. టీ.–సున్నం కొట్టేస్తారు...అయినా టార్చిలైట్ తేవాల్సింది నేను'...

'ఫర్వాలేదులే...కడిగితే పోతుంది'...

ఆ మలుపులోఉన్న డబ్బా కొట్టు దాటించి మరొక సందులో ప్రవేశించాడు.

'ఇక వచ్చేశాం సార్...ఇంకెంత ఫ్యూయార్డ్స్'... అని అంతలోనే ఏదో జ్ఞాపకం వచ్చినట్లు తలగీక్కుని 'మీ రిక్కడే ఉండండి సార్!'...అంటూ పెద్ద పెద్ద అంగలేస్తూ కిళ్ళీకొట్టుకేసి నడిచాడు ధోవతిచెంగు పైకెత్తుకొని.

నిర్జీవమైన ఆ సందులో డబ్బాకొట్టు–చిన్నకోడిగుడ్డుదీపంతో దాని సజీవత్వం వ్యక్తపరుస్తోంది–అందంగా అమర్చిన ఖాళీ సిగరెట్టు పెట్టెలు పిప్పరమెంటు సీసాలు–ఏవేవో చిన్న డబ్బాలు. కాళ్ళు వేలాడ వేసికొని బీడి దమ్ములాగుతూ దినపత్రికను భూతద్దంలో చూస్తున్నాడు కొట్టుమనిషి.

మూర్తి గొంతు చిన్నగా మాట్లాడింది.

కొట్టుపైనుండి దూకి నిటారుగ నిలబడ్డాడు–అతను. వేలాడుతూన్న గెలనుండి సర్రున ఓ అరడజను అరటిపండ్లు కోసి మూర్తి చేతిలో పెట్టాడు. మళ్ళీ మూర్తి సీరియస్‌గా చెప్పాడు గాలిలో చేయి ఊపుతూ.

బీడి ఘాటుగా నాల్గు దమ్ములు లాగి అవతల పడవేసి తమలపాకులు అందుకొని తడి తుడవసాగాడు ధోవతిపై.

'వెళ్దాం సార్'–అరటి పండ్లను ధోవతి చెంగులోదాస్తూ మూర్తి ముందుదారి చూపెట్టాడు.

మరో మలుపు తిరిగింది మూర్తి శరీరం.

'వచ్చేత్తన్నారు...వత్తన్నారు'...

వీధి అరుగుపై పది సంవత్సరాల పిల్లల గొంతులు అరుస్తున్నాయి. హరికేన్ దీపపు వెలుగులో వాళ్ల కళ్ళు మిలమిలలాడుతూ పొంచి చూస్తున్నాయి. వాళ్ళ వెనుక తలుపుకు చేరువగా నిలబడిన ఇల్లాలు లోనికి తప్పుకొంది.

'మీరందరూ ఇంకా నిద్రపోలేదా!...లోనికి పొండి...' మూర్తి గొంతు కసురుకొంది.

'ఇదే సార్ మా యిల్లు...ఈ లాటి ఇల్లు మెయిన్ రోడ్డులో అయితే 'యాభై'కి తక్కువ చెప్పరు. ఇంటిముందే కుళాయి...అన్నివసతులున్నాయి. తరువాత ఇంటి ఓనర్ కూడ చాలా మంచివాడులెండి... నేను నెల తిరగకముందే టంచనుగా అద్దె అప్పజెబుతానని మనమంటే కొద్దిగా ఇది చూపిస్తాడు'...

ప్రక్కకు తిరిగి చూశాను. చెడిపోయిన కుళాయి 'సర్ సర్'మంటూ నీళ్ళుకక్కి వీధంతా రొచ్చు చేస్తోంది.

'మీ రిక్కడ ఆగండి సార్ అరుగుమీద'... అంటూ లోనికెళ్ళాడు. హనుమంతుడు సంజీవి కొండ తెచ్చినట్లు నిగనిగలాడే రాగిబిందెతో ప్రత్యక్షమయ్యాడు. నేను కాళ్ళు చేతులూ కడుక్కున్నంత సేపూ ఒక చేతిలో సోప్ డిష్ పట్టుకొని నిలబడ్డాడు. ఫ్యాన్ అందించిన టవలుతో శుభ్రంగా తుడుచుకొంటూ, కాళ్ళు విదిలించుకొని మెల్లగా లోనికి నడిచాను.

గోడలపై మాసిపోయిన దేవుళ్ళ ఫోటోలు, చినిగిపోయిన సినిమా తారల కేలండర్లు, వంకీకి తగిలించిన మూర్తి పాత చొక్కాలు, బారుకు రెండు రెక్కలు తెరచుకొన్న అలమారులో పిల్లల పుస్తకాలు, దాని ప్రక్కనే చాపపై మునగడ తీసికొన్న ఇద్దరు పిల్లలు. పుస్తకాలు ఛాతీపై వేసికొని నిద్రపోతున్నారు — ప్రక్క గదిలోనుండి ఈ వంక సన్నగా మాటలు వినిపిస్తున్నాయి.

'తప్పుకదూ!...మీకు నాన్నగారు ఇన్ని అరటిపండ్లు తెస్తారు...ఇవి మీకు కాదని చెప్పాకదా?... పెద్దవాళ్లు మనింటి కొచ్చినప్పుడు ఇలా అల్లరి పెట్టవచ్చా?...హుష్...ఒరే...బుజ్జీ, నీవు మరింత కరువు బోతువురా...వాటిని ముట్టుకొంటే చేతులు విరగ్గొట్టేస్తా...ఆఁయ్...పడుకోండి'...సాధ్యమైనంత మెల్లగా కసురుకొంటోంది ఆ గృహిణి కంఠం.

'నా కొకటిచ్చెయమ్మా...మళ్లీ ముట్టుకోను. అక్కాయ్ కొద్దులే'...చిన్న పిల్లవాని కంఠం మరింత దీనంగా బ్రతిమాలుతోంది.

'జాగ్రత్త సార్...పైన గడప తగులుతుంది—పాడు..:ఎప్పుడో ఇక్ష్వాకులనాడు కట్టింది సార్...ఆ పీటపై కూర్చోండి......కస్తూరీ, మా అమ్మను పిలువు'...రెండు దోసెఅని గడప ఇవతలనుండి అరిచే సప్లయర్‌లా పెద్దగా కేకపెడుతూ ముందు గదిలోకి నిష్క్రమించాడు మూర్తి.

నా పీటముందు స్టెయిన్‌లెస్ పళ్లెం— ఒక గ్లాసు—తోమిన ఇత్తడి మరచెంబుతో మంచినీళ్లు. స్టెయిన్‌లెస్‌స్టీల్ మరచెంబు కొనలేకపోయి ఉండవచ్చు మూర్తి. పొడలుపొడలుగా నలుమూలలా ప్రాకుతోంది హరికేన్‌లాంతరు వెలుగు. గోడమీద మరో కోడిగుడ్డు దీపం.

దీపపువెలుగులో తుప్పుపట్టిన డాల్డా డబ్బాలు—ఓవల్టిన్ డబ్బాలు అసంఖ్యాకంగా చిందరవందరగా ఉన్నాయి. వాటిపైన నల్లగా పొగ చూరిపోయిన లేబిల్స్—ధనియాలుకారం — మిరపకాయలు — కరివేపాకు మొదలైన పేర్లు కావచ్చు. కుంపటి ప్రక్కగాఉన్న అలమారులో ఇత్తడిగ్లాసులు, తదితర అల్యూమినమ్ వంటపాత్రలు. సరిగా పొగపొయ్యే వీలులేక వంటింటి గోడలన్నీ నల్లగా పొగబారి ఉన్నాయి. ఇల్లంతా జీర్ణావస్థలోఉన్న వస్తువులతో పాతగుడ్డలతో మాగుడు వాసన లీనుతోంది.

'నమస్కారమండి'...గాజుల గలగలలతోసహా కంఠం వినిపించింది. గృహిణి వినయంగా చేతులు జోడించింది.

తెల్లగా పాలిపోయిన ముఖం—సాగి సన్నబడిన మెడ—నొసట తిలకం— విశాలమైన కళ్లు మినహా మరో అందంలేదు. పెట్టె అడుగున చానాళ్లుగా భద్రపరచపడిన పట్టుచీరె నలిగిన మడతల్లో పూచిక పుల్లలా ఆమె —ప్రకోపించిన ఉదరంతో.

రెండు లడ్లు తెచ్చి నాకు వడ్డించింది.

'మూర్తీ......నాతోపాటు నీవు కూడ భోంచెయ్యి'...అడిగాను. మూర్తిలో రక్తసంచలనం ఆగిపోయింది. కళ్లప్పగించి ఓ క్షణం అలాగే చూశాడు. 'లేదండీ—మీరు భోంచేశాక నేను భోంచేస్తాను. నేనిప్పుడే భోంచెయ్యను. నేను రోజూ పదిగంటలు దాటిన తరువాతనే భోంచేస్తాను.........నే నిప్పుడే భోంచెయ్యను'......కంగారు కంగారుగా నీళ్లు నమల సాగాడు మూర్తి.

'సరే'...లడ్డు చిదిపి తినసాగాను.

'ఇంక రెండు వేయించుకోండి'...మధ్య గది గడపమీద కాలు పెట్టి వడ్డన విషయమై అజమాయిషీ జరుపుతూన్న మూర్తి అన్నాడు.

'వద్దు...వద్దు...ఇవి చాలు'...

'ప్రిపరేషన్ బాగుండలేదా?...

'ఓహ్...ఎక్సలెంట్'...

'అయితే ఇంకా రెండు వేయించుకోండి'... తన ఇల్లాలిని కళ్లతో ఆజ్ఞాపించాడు.

ఒక లడ్డు తెచ్చి పళ్లెంలో పెట్టింది.

'రెండు ఒద్దులెండి...తీపి ఎక్కువతింటే పులిహోర—అవి భోంచెయ్యలేరు'......ఆమె సంజాయిషీ చెప్పింది.

'అమ్మా'...అయిదారేళ్ల పిల్ల లోనికి తొంగి చూసింది. లాంతరు వెలుగులో ఆ అమ్మాయి కళ్లు భయం భయంగా చూస్తున్నాయి.

'నీ విక్కడి కెందుకొచ్చావ్?...వెళ్లి పడుకో... వెళ్లు. ఊరంతా నిద్రపోతూంటే నీ కళ్ల కింకా నిద్ర రాలేదా?'...ఏదో జరగరాని అపరాధం జరిగిపోయినట్లు ఆ పిల్లకేసి కళ్లు ఉరమసాగాడు.

'ఉండనివ్వు...ఎందుకలా కసురుకొంటావ్?'...

'ఈ పిల్లల సంగతి మీకు తెలియదు సార్... గారాబంచేస్తే నెత్తికెక్కి కూర్చుంటారు......ఏదో మర్యాదా మన్ననా నేర్చుకోవాలిగదా?'...

'నీకు ఆడపిల్లలెంతమంది?'

'నాకా సార్...నాకు ముగ్గురు మొగపిల్లలు. ఇద్దరాడపిల్లలు. మగపిల్ల లిద్దరు పెద్దవాళ్లు... హైస్కూల్లో చదువుతున్నారు. ఇప్పుడొచ్చిన పిల్ల పెద్దది. దీని తరువాత మళ్లా ఒక మగ పిల్లవాడు. చివరది మళ్లీ ఆడపిల్ల...ఎంతో అదృష్టవంతురాలు. అది పుట్టిన వారంరోజులకల్లా మీరిక్కడకు రావటం మా అదృష్టం...మీ చల్లనిచూపు మా మీద ఉండటం, నాకీ ప్రమోషన్ రావటం, అంతా దైవ నిర్ణయం. మీరు చేసిన మేలు ఈ జన్మలో తీర్చుకో లేమండీ...రోజా తనూ, నేనూ మిమ్మలను జ్ఞాపకం చేసికొంటు 'ఉంటామండి'...అర్ధనిమీలితనేత్రుడై పర వశంతో చెప్పుకుపోసాగాడు.

'ఇంకా కొద్దిగా బంగాళాదుంపలవేపుడు వడ్డించ మంటారా?'...

'వద్దమ్మా...ఆ బెండకాయ పులుసు కొద్దిగా వెయ్యి'...

'అయితే మీ పెద్దమ్మాయి పుట్టినప్పటినుండి ఏమీ కలిసిరాలేదా?'...

'చిత్తం...కలిసిరాకపోవటమంటే...ఏమీ అనర్థాలు దాపురించలేదండీ...అది కూడా ఒక అదృష్ట మనుకోవాలిలెండి...అది పుట్టిననాటినుండి ఇంట్లో ఎవరూ తలనొప్పి–జ్వరమని మంచాన పడలేదు... అదృష్టం మాట ఏమోకానీ పిల్లది చాలా తెలివి కలదండీ...పట్టుమని పదేళ్లు లేవు...పది ఎక్కాల వరకూ గణగణమని గంట కొట్టినట్లు అప్పజెబు తుంది...వెంకటేశ్వర సుప్రభాతం ఎంచక్కా చదువు తుందో...' ఉబ్బితబ్బిబ్బయిపోయి అరమోడ్పు కన్ను లతో తన పుత్రికయొక్క అఖండమైన తెలివి తేట లను వర్ణించ సాగాడు.

'అహ...అలానా?... గుడ్...పది ఎక్కాలు చెబుతుందా?...ఏం పేరూ?' ఆవకాయ కలుపుకొంటూ అడిగాను మూర్తికేసి కళ్లు తిప్పుకొని.

'పేరు...కస్తూరండి'...

'నాన్నా...మరి తమ్ముడే...'తమ్ముడే...మీరు తెచ్చిన అరటిపండ్లు తింటున్నాడు...వద్దురాంటే ఏడు స్తున్నాడు'...ఆ పిల్లను మెచ్చుకోవటం గ్రహించి ధైర్యంగా కంప్లెయింట్ చేసింది — అమాయికంగా కళ్లుతిప్పుతూ.

నేను చూసీ చూడనట్లు గమనించసాగాను.

మూర్తి నొచ్చుకొంటూ కనుబొమలు ఎగర వేశాడు.

కళ్లు పెద్దవిచేసి 'ఇక్కడికి రావద్దన్నానుకదా!.. ఎందుకొచ్చావ్?... డొక్క చీరేస్తా...ఆఁయ్' అనేలా అనేక అర్థాలు స్ఫురించేలా, భీతిగొలిపే హావభావాలు ప్రదర్శించేడు.

ఆ పిల్ల కిక్కురు మనకుండ తిరోగమించింది చీకటిలో తచ్చాడుతూ— ఉన్న ఒక్కలాంతరూ కోడి గుడ్డు దీపానికి సహాయంగా వంట గదిలోనే ఉండి పోవటాన.

'పిల్లలు...సిసింద్రీలు సార్...వేపుకుతింటారు' అంటూ మెల్లగా ప్రక్కగదిలోకి నడిచాడు నా ప్రత్యుత్త రానికి ఎదురు చూడకుండా. అంతలోనే ఆ గదినుండి రెండు పసికంఠాలు బావురుమని ఏడ్వబొయ్యాయి. మళ్ళీ బలవంతంగా ఏడుపు ఆపుకోటానికై చేతులు నోటికి అడ్డం పెట్టుకొన్నప్పటి స్వనం-- మధ్య మధ్యలో ఎక్కిళ్లు.

'మళ్లీ గొంతు వినిపించిందంటే తాట ఒలి చేస్తా...జాగ్రత్త.'

మూర్తిగొంతు సాధ్యమయినంత తక్కువ స్థాయిలో పిల్లలను అదుపులో పెట్టసాగింది.

'మజ్జిగ ఉన్నాయమ్మా'......

'పెరుగుందండీ...మీ కోసమని ప్రత్యేకంగా పాలుకొని తోడు వేశాను'. హోటల్‌లోలా చిన్నగిన్నెలో తోడుకొన్న పెరుగుతెచ్చి కంచంలో వేసింది.

'అలానా!...అయ్యో...ఎందుకంత శ్రమ?'

'అప్పుడే పెరుగు వేయించేసికొన్నారా?... అయ్యో...మీరు ఏం భోం చేసినట్లు...ఏదో చెయ్యి కడిగానని పేరు కు తప్పితే'...

పిల్లల నోళ్లు మూయించి వచ్చిన మూర్తి మళ్ళీ నోరు విప్పాడు.

ప్రక్కగదిలోనుండి నెలలపాప ఏడుపు కెవ్వున వినిపించింది.

'అరెరే...చంటిది లేచిందే!...నే వెళ్ళి చూస్తాలే...నీవు వారికేమేం కావాలో జాగ్రత్తగా చూడు'...

'ఏమీ అక్కర్లేదు...అయిపోయిందిగా...కొద్దిగా ఉప్పువేసి నీవు వెళ్లమ్మా'. నేనన్నాను.

'ఆ...ఫర్వాలేదు లెండి...పాలుపట్టిస్తే అదే పడుకొంటుంది... ఏమండీ?...ఆ పాలసీసాతెచ్చి ఈ పాలుపోసికొనివెళ్ళి పట్టించండీ...మా పెద్ద పిల్లలున్నారంటే తొమ్మిదింటికే ముసుగు తన్ని పడుకొంటారు'...అంటూ పొయ్యిమీద పాలగిన్నె కాడపట్టుకొని మూర్తికి అందించింది.

రెండు మూడు నిమిషాల్లో ఆ చంటి పిల్ల ఏడుపు తగ్గిపోయి ఒక రకమైన మూలుగులా మారిపోయింది. మధ్య మధ్య పాలపీక చప్పరింపులు మినహా మరే శబ్దమూ లేదు.

ఎంగిలి చేయి కడుక్కొని వంటగది గడపదాటబోయ్యాను.

'కొద్దిగా తలవంచుకోండి'...హెచ్చరింపుతో పాటు తువ్వాలు అందించాడు. నా భోజనం కొరకై వినియోగించిన లాంతరు నా వెంటనే తెస్తూ ముందు గదిలోకి దారి చూపెట్టాడు.

చిన్నపిల్లలు ఆడుకొనే గిలకపండ్లు—సొట్టలు బోయిన పాత పౌడరు డబ్బాలు—లక్కపిడతలు—చంటి దాని మూత్రం తుడిచే గోనెపట్టా - మొదలైన వస్తువులను కాళ్ళతో తన్ని శుభ్రం చేశాడు.

'ఓ నిముషం ఇలా కూర్చోండి'...వాలు కుర్చీ పట్టా విదిల్చాడు. శ్మశానంలో గుంట నక్కలా కాచుక్కూర్చున్న ప్యూన్ బయట అరుగుపై తన ఉనికిని వ్యక్తపరుస్తూ చిన్నదగ్గు దగ్గాడు.

'నరసయ్యా.. నీవు లోనికెళ్లు'...మూర్తి అతన్ని కేకవేసి నాల్గు చక్కరకేళీలున్న 'ట్రే' పట్టుకొచ్చాడు.

'ఇప్పుడే వస్తాను సార్ రెండు నిముషాల్లో... కిళ్లీలు కట్టమని చెప్పివచ్చాము...ఇందాకవస్తూ... మళ్ళీ దుకాణం మూస్తాడేమో'...అంటూ నా ప్రత్యుత్తరానికి ఎదురు చూడకుండా తన రధాన్ని గబగబా మెట్లపైనుండి దింపి ఆ రొచ్చులోనే బలవంతంగా తొక్కుకుంటూ వెళ్ళిపొయ్యాడు.

మసక మసగ్గా హరికేన్ దీపపు వెలుగు...

వెనక వంటగదిలో గిన్నెలు సర్దుకొంటూన్న చప్పుడు...

ప్రక్కగదిలో ఏడుస్తూ—రాగంలా, చంటిపాప పాలపీకను చీకుతూన్న శబ్దం...

ప్రక్కకు తిరిగి చూశాను.

ద్వారం ప్రక్కనే మూడు నాల్గు సంవత్సరాల పిల్లవాడు. బొత్తాములులేని లాగు భుజాలకున్న పట్టీలకు వేలాడుతోంది. చొక్కాలేదు. నిద్రకళ్ళతో జోగుతూ ఆశగా విరాశగా నాకేసి చూస్తున్నాడు.

రెండు అరటిపండ్లు చూపించి అందుకోమని చెయ్యి చాపాను—కళ్లతో పిలుస్తూ. చీకటి గదిలో 'లైట్ ఆన్' చేసినట్లు గప్పుమని అతని కళ్ళు ప్రకాశవంతమయ్యాయి. ఓ క్షణకాలం తటపటాయిస్తూ దిక్కులు చూశాడు.

'తీసుకోకురా...తమ్ముడూ' ... హెచ్చరించింది తలుపు ప్రక్కనుండి ఐదేళ్ళపిల్ల. చౌకబారు నైలాన్ గౌను - పొట్టపై భాగంలో కుట్లు ఊడిపోయి కొద్దిగా క్రిందికి వేలాడుతోంది—సరియైన పోషణలేక వాడిపోయిన బుగ్గలు—సన్నగా ఉన్న కాళ్ళూ చేతులు.

కళ్ళుమాత్రం తన పరిశీలనా శక్తినీ...తెలివి తేటలనూ వ్యక్తపరుస్తున్నాయి.

'నీవేనా కస్తూరివి?'......

......కొరాకొరా కోపంగా చూసింది.

'ఇటురా కస్తూరీ...నీవు మంచి అమ్మాయివి కదూ?...పెద్దవాళ్ళు పిలిస్తే రావాలని అమ్మ చెప్ప లేదా?...ఏదీ రెండో ఎక్కం చెప్పు.. పది ఎక్కాలు చెబుతావటగా!...ఇటురా మరి...ఇదిగో నీ అరటి పండు'...చెయ్యి చాపాను.

'నాకేమీ వద్దులే...అరటిపండ్లు...ఒక్కటైనా కూడా మిగల్చకుండా మూడూ తినేసీ...అరటిపండ్లు నాకేమక్ఖర్లేదు'...

ఆ చిన్నారి కళ్ళలో కన్నీరు ఊయల లూగ సాగింది—ఆ కనుపాపలు నిస్సహాయమైన కోపంతో, చీత్కారంతో నా కేసి చూడసాగాయి.

తడి ఆరిపోయిన పెదవులు లోపలికి వత్తుకొని చూపు ప్రక్కకు తిప్పుకొన్నాను.

'అక్కాయ్ కొద్దట...నీవు తీసికో!'...పిల్ల వానికి దగ్గరగా జరిగాను.

సందేహిస్తూ మెల్లగా నా చేతిలో అరటిపండ్లు అందుకొన్నాడు. అందుకొన్నదే తడవుగా గభగభా మింగ సాగాడు—భయం భయంగా వీధి వాకిలికేసీ...వంట గదికేసీ చూస్తూ.

'మళ్ళీ...మళ్ళీ...రేపుకూడ వత్తారా?' కృత జ్ఞత వెల్లివిరుస్తోన్న కళ్ళతో పరవశం నిండిన కంఠంతో అడిగాడు.

'రమ్మంటావా?'......దగ్గరకు తీసికొన్నాను ఆప్యాయంగా.

ఆహ్వానిస్తూన్న కళ్ళతో అంగీకార సూచనగా తల ఊపి... 'అవుతే...అవుతే...మరి...మరి...రేపు కూడా...నాన్నగారు...నాన్నగారు...మళ్ళీ అరటిపళ్ళు తెత్తారు...కదూ'...అన్నాడు ఆనందోద్వేగంతో.

'మన్నించాలి సార్'......గసబోసికొంటూ మెల్లెక్కుతూన్న మూర్తి.